# పర్యావరణ పరిరక్షణే పరమావధి

(జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

అణుబాంబులు,
ఇతర గ్రహాల నుంచి వచ్చి సమరశంఖం పూరించే బుద్ధిజీవులు,
డైనోసార్లవంటి బృహత్ జంతువులు,
సూర్యుడు నోవాగా మారి పేలిపోవడం,
మానవాళిని సర్వనాశనం చేయగలవి ఇవేవీ కాదు...
ఇప్పుడు మనం తెలిసి చాలా, తెలియక కొంత పర్యావరణానికి చేస్తున్న హాని చాలు.



ఆ సత్యం మనకు తెలుసు. అందుకే పర్యావరణ పరిరక్షణపై మనం చాలాకాలం క్రితమే దృష్టి సారించాం. అయితే ఆ దిశగా మన పయనం వేగంగా సాగడం లేదు. అదే ఇప్పుడు అసలైన సమస్య.
పర్యావరణాన్ని మనం చేస్తున్న హాని ఏమిటో తెలుసుకుంటే దానికి నివారణోపాయాల గురించి ఆలోచించొచ్చు.
మోటారు వాహనాలు, క్లోరో ఫ్లూరో కార్బన్ల వినియోగం నుంచి ఫ్యాక్టరీలు, డ్యామ్‌ల నిర్మాణం వరకూ చివరకు ఎడారుల విస్తరణ వంటి అనేక సమస్యలు  పర్యావరణ సమస్యతో ముడిపడినవే. ఇవన్నీ దేనికదే పెద్దవి.
డ్యామ్‌ల నిర్మాణం వల కలిగిన నష్టాలనే తీసుకుంటే..
అటవీ ప్రాంతాలలో కొత్తగా నిర్మిస్తున్న డ్యామ్‌ల వల్ల అడవులు నాశనం కావడం కంటికి ప్రత్యక్షంగా కనిపిస్తే, గిరిజనుల జీవన విధానం మారిపోవడం, వారు నిర్వాసితులు కావడం, డ్యామ్‌ల నిర్మాణం వల్ల నిల్వ ఉండే నీరు కారణంగా ఆ ప్రాంత భూమిపై  భూకంపాలకు అవకాశం ఏర్పడడం వంటి ఎన్నో సమస్యలు పుట్టుకొస్తున్నాయి.
ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి నదిపై నిర్మించతలపెట్టిన  'పోలవరం' ప్రాజెక్ట్ కూడా ఇటువంటి సమస్యలతోనే సతమతమవుతోంది. అది మనం వార్తల్లో చూస్తున్నాం.
రాష్ట్ర రాజధానిలో ప్లాస్టిక్ బ్యాగ్‌లపై నిషేధం  పర్యావరణ సమస్యను దృష్టిలో ఉంచుకుని చేసిందే.
ఇదీ రాష్ట్ర స్థాయిలో ప్రజలను జాగురూకులను చేస్తోంది.
అయితే అంతర్జాతీయ స్థాయిలో ఈ చైతన్యం ఎక్కువగా కనిపిస్తోంది.
నాగరికత పరిణామక్రమంలో ఇటువంటి సమస్యలు పుట్టుకురావడం సహజమే.  ఆ సమస్యలకు నివారణోపాయాలేమిటో  చాలా తెలుసుకున్నాం.
ఇప్పుడు చేయవలసిందల్లా వాటిని పాటించడమే.
మరోరకంగా చూస్తే నాగరికత ఒక్కటే కాదు. జనాభా పెరుగుదల కూడా పరోక్షంగా కారణమే.
ఎందుకంటే జనాభా పెరుగుదల పరిమితంగా ఉంటే విద్యుత్, నీరు, మోటారు వాహనాల వినియోగం వంటివన్నీ తగ్గిపోతాయి.
ఇదీ మనకు తెలిసిందే.



ఇన్నీ తెలిసీ పర్యావరణాన్ని రక్షించుకునేందుకు మనమేం చేస్తున్నాం?
ఏమీ చేయడం లేదేమోనని ఆలోచించండి.
కేవలం  ప్లాస్టిక్ బ్యాగ్‌లు చేసే  చెరుపు చూడండి...
ప్లాస్టిక్  బ్యాగ్‌లు త్వరగా మట్టిలో కలవవు.
నీటిలో, నేలపై జీవజాలానికి హానికారకం.
ఎక్కువకాలం ఈ బ్యాగ్‌లలో నిల్వ చేసిన ఆహారం విషతుల్యం కాగలదు.
డ్రైనేజీ సమస్యలకు కూడా ప్లాస్టిక్ బ్యాగ్‌లే కారణం.
ఇక గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ సృష్టించబోయే విలయం మనకు తెలియనిదేమీ కాదు.
ఇదంతా చూస్తే మీకేమనిపిస్తోంది.
మానవాళికి  నాశనం చేసేది, నష్టం చేకూర్చేది మరెవరో కాదు. మనమే!
మనకు మనమే నష్టం కొనితెచ్చుకుంటున్నాం.
దీనిని ఆపాలంటే....
పర్యావరణ పరిరక్షణే మన పరమావధి కావాలి.